వరద కాల్వ లైన్‌లోకి సివరేజీ కనెక్షన్



పనులను అడ్డుకుంటున్న సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు

- అడ్డుకున్న సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు
- అక్రమంగా తవ్విన గుంతను పూడ్చివేయించిన వైనం

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన వరదనీటి కాల్వ నాలాలోకి సివరేజీ కనెక్షన్ ఇచ్చేందుకు జలమండలి అధికారులు యత్నించగా ఆ పనులను అడ్డుకుని అక్రమంగా తవ్విన గుంతను శనివారం పూడ్చివేయించారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి చంద్రపురికాలనీ పరిధి వరకు వరద కాల్వ నిర్మాణం చేపట్టారు. ఫిబ్రవరి మాసంలో వరదనీటి కాల్వలోకి డ్రైనేజీ లైన్‌ను కలపరాదని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు రాతపూర్వకంగా కాలనీ సంక్షేమ సంఘానికి చెప్పి పనులను ప్రారంభించింది. పనులు సాఫీగా సాగుతుండగా జలమండలి అధికారులు ఈకాల్వలోకి డ్రైనేజీ మురుగునీటి కనెక్షన్ కలుపుతున్నారని ఊహించిన సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు ఆ అక్రమ కనెక్షన్‌ను శుక్రవారం అడ్డుకుని శనివారం అక్రమంగా తవ్వినగుంతను కాలనీవాసులు పూడ్చివేశారు.

'బహుళ అంతస్తులోని నివాసితుల కోసమే జలమండలి పాకులాట'

ఎల్‌పీటీ మార్కెట్ వెనక బాగాన సుమారు 1100 మంది నివాసితులతో బహుళ అంతస్తుల నిర్మాణం జరిగిందని, వారికి సౌకర్యంగా ఉండడం కోసమే జలమండలి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వరదనీటి కాల్వ నాలాలోకి డ్రైనేజీ నీటి కనెక్షన్‌ను కలిపేందుకు యత్నించారని సెంట్రల్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కిడి తిరుమల్‌రెడ్డి, కార్యదర్శి ఠాకూర్ రాకేష్‌సింగ్, ఉపాధ్యక్షుడు మందుల విద్యాసాగర్, సభ్యులు ఆరోపించారు. బహుళ అంతస్తుల నిర్మాణదారులు ఎస్‌టీపీలను ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని మాత్రమే వదలాల్సి ఉండగా వారు దానికి విరుద్ధంగా జలమండలి అధికారులు తమ వర్క్ ఆర్డర్‌లోనే డ్రైనేజీ మురుగు కాలువ అని పేర్కొన్నారని తెలిపారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్ శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్స్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును ప్రవీణ్‌రెడ్డికి అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి : ఎంపీ ఈటల

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని, అర్హులైన పేదలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. నాగోల్ డివిజన్‌కు చెందిన తలకంటి స్వామిరెడ్డి ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో స్వామిరెడ్డి వైద్యం నిమిత్తం వారి కుటుంబ సభ్యులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా నిధులు మంజూరయ్యారు. ఆ నిధులకు సంబంధించిన చెక్కును శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ ఆధ్వర్యంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి సమక్షంలో స్వామిరెడ్డి కుమారుడు తలకంటి ప్రవీణ్‌రెడ్డికి శామీర్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఈటల అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

చంపాపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కాలనీలో సీసీ కెమెరాలు, సీసీ రహదారులు, యూజీడీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీకి వారు వినతిపత్రం అందజేశారు. కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కాలనీ అధ్యక్షుడు దోర్నాల విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌యాదవ్, కోశాధికారి రాహుల్‌సాగర్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిరణ్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సబితకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్‌లోని కుతుబ్ షాహి మసీద్, శ్మశానవాటిక పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సరూర్‌నగర్ నాయకులు మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సరూర్‌నగర్ వార్డు కమిటీ సభ్యుడు మహ్మద్ జహీర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుతుబ్‌షాహి మసీద్, శ్మశానవాటికను అన్ని హంగులతో తీర్చిదిద్దడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి80లక్షలతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడంతో ఎన్నికల కోడ్ వచ్చిందన్నారు. దీంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. ఆ పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. స్పందించిన ఆమె అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ రజాక్, మహ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

- మేయర్ పారిజాతారెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపడానికి చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. అల్మాస్‌గూడ 4వ డివిజన్ పరిధిలోని బీఆర్ఆర్ ఎన్‌క్లేవ్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంపై తాము ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. అన్ని డివిజన్లలో ఆయా పనులను దశలవారీగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పెద్ద పిల్లల దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించిన భావనా సక్సేనా తదితరులు

పెద్దపిల్లల్ని దత్తత తీసుకోవాలి: కారా సీఈవో

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల్ని పెంచుకోవాలనుకునే తల్లిదండ్రులు చిన్న పిల్లలనే కాకుండా పెద్దపిల్లలను కూడా చట్టబద్ధంగా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) సీఈఓ భావనాసక్సేనా అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పిల్లల్ని పెంచుకోవాలనే తల్లిదండ్రుల్లో 95 శాతం మంది 0-6 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్టపడుతున్నారన్నారు. కానీ 6 నుంచి 13 సంవత్సరాలు, 13 నుంచి 19 సంవత్సరాల వారిని కూడా దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి బాధ్యతగా తీసుకుని దత్తత విధానాన్ని మరింత సరళతరమయ్యే విధంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి బాలలను కూడా చట్టబద్ధ దత్తత విధానంలోకి తీసుకురావాలని ఆమె సూచించారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహ జొన్నలగడ్డ మాట్లాడుతూ వేరే పిల్లల్ని దత్తత తీసుకుని పెంచటం అనేది ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అన్నారు. దత్తత కోసం విదేశాల నుంచి కూడా ఎందరో వస్తున్నారని, అలాంటి సందర్భాల్లో పిల్లలకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుందని, వారికి వెంటనే పాస్‌పోర్ట్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 'పెద్ద వయసు పిల్లల దత్తత' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎ.కాంతివెస్లీ, ఎస్‌సీసీఆర్ ప్రతినిధులు అపర్ణ, అంజనారావు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న డిజిటల్ అధ్యయనం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సెమినార్‌లో పాల్గొన్న వక్తలతో ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సరూర్‌నగర్: ప్రస్తుతం విద్యా వ్యవస్థలో డిజిటల్ అధ్యయనం కీలకంగా మారిందని, కొవిడ్-19 తర్వాత దాని ప్రాముఖ్యత మరింత పెరిగిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. గ్లోబలైజేషన్, లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, డిజిటలైజేషన్(జీఎల్‌పీడీ).. ఈ నాలుగు విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కొవిడైజేషన్ అనేది కొత్తగా వచ్చి చేరిందని, దాని(కొవిడ్) రాకతో విద్యా వ్యవస్థ మొత్తం డిజిటల్ అధ్యయనం వైపు మళ్లిందని ఆయన అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 'ఉన్నత విద్యాసంస్థల పరీక్షలు-సంస్కరణలు-వ్యూహాలు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ఎంత ముఖ్యమో అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(ఏఎస్ఆర్) సైతం అంతే ముఖ్యమని అన్నారు. డిజిటల్ అధ్యయనంలో నిరంతర మూల్యాంకనం కూడా ఒక భాగంగా ఉండాలని, మూల్యాంకనం లేకపోతే అధ్యయనానికి అర్థం ఉండదని ఆయన అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, బెంగుళూరులోని అభయ్ ఇంటర్నేషనల్‌కు చెందిన రామచంద్రారావు, వరంగల్ నిట్ ప్రొఫెసర్ అప్పారావు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.ఎల్.సాయికుమార్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.కుమార్, ఓయూ ఎఫ్ఓఈ డీన్ ప్రొఫెసర్ శ్యామల, ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ కె.శశికాంత్, ఎంవీఎస్ఆర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ కేపీ శ్రీనివాసరావు, డాక్టర్ కశ్యప్, జూపూడి సుధాకర్, హిరణ్మయి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గుంటూరు, ఎగ్జామ్స్ డీన్ డాక్టర్ సీపీ వర్ధని పాల్గొన్నారు.



డీజీకి జ్ఞాపికను అందజేస్తున్న జైలు సూపరింటెండెంట్

దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ జైళ్లశాఖ

- డీఐజీ డాక్టర్ శ్రీనివాస్

సైదాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నూతన సంస్కరణలు, ఆధునిక టెక్నాలజీ ద్వారా తెలంగాణ జైళ్లశాఖ దేశంలోనే నంబర్-1గా నిలిచిందని జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ డి. శ్రీనివాస్ తెలిపారు. చంచల్‌గూడలోని జైళ్లశాఖ శిక్షణ అకాడమీలో జైలు అధికారులు, సిబ్బందికి నిర్వహించనున్న రెండు రోజుల పునశ్చరణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ తరగతులలో జైళ్లశాఖ మరింతగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, చంచల్‌గూడ, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన జైలు అధికారులు, సిబ్బంది మొత్తం 221 మంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : మల్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ జిల్లా పరిషత్‌లో శనివారం జిల్లా మహిళా అండర్-19 కబడ్డీ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కబడ్డీలో రాణించి అవార్డు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరిత, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కౌన్సిలర్ కౌశిక ఐలయ్య పాల్గొన్నారు.

చలిగాలుల తీవ్రతతో అప్రమత్తంగా ఉండాలి : కామినేని వైద్యులు



మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితర డాక్టర్లు

హైదరాబాద్ సిటీ/మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ వివరాల ప్రకారం రానున్న వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చలిగాలులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, చలిగాలి తీవ్రతతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్‌లోని కామినేని అస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలిగాలుల తీవ్రతతో ఫ్లూజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం కూడా హెచ్చరించిందని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు వెంటనే సమీపంలోని ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. చలిగాలుల తీవ్రత ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల్లో ఎక్కువగా ఉంటున్నందున వారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. చలిగాలుల కారణంగా శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్, న్యుమోనియా వంటి వ్యాధులు సోకుతాయని, దగ్గు, జలుబు, జ్వరం, తల తిరగడం, నీరసం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఈ వ్యాధులు దరిచేరకుండా నిత్యం గోరువెచ్చని నీరు తాగాలని, ఎప్పటికప్పుడు స్వీయ శుభ్రతతో పాటు ఇంటి పరిసరాల శుభ్రతను పాటించాలని, బయట ఎక్కువగా తిరగరాదని సూచించారు. సమావేశంలో సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ హరికిషన్, పిడియాట్రీషియన్ డాక్టర్ కంచన్ ఎస్ చన్నావర్ ఉన్నారు.



రవికుమార్‌కు ఉస్మానియా డాక్టరేట్

- బాలల హక్కులు మీడియా కవరేజీ విభాగంలో పరిశోధన

హైదరాబాద్ సిటీ : 'బాలల హక్కులు మీడియా కవరేజీ' అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించిన తూటుపల్లి రవికుమార్‌కు ఉస్మానియా వర్సిటీ జర్నలిజం విభాగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన తూటుపల్లి రవికుమార్ సీనియర్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో పిల్లలకు మీడియా ఇస్తున్న ప్రాధాన్యతపై పరిశోధనలు చేశారు. సమాజంలో రోజు రోజుకు చిన్న పిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత స్థాయిపై పరిశోధనలు చేసి పత్రాలను సమర్పించారు. రవికుమార్ తన పరిశోధన పత్రంలో చిన్నారులకు మీడియా ఇస్తున్న ప్రాధాన్యతపై విశదీకరించారు.

ప్రజలు సంఘటితంగా ఉంటే దేశం సురక్షితం

- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్



బీజేపీ విజయోత్సవ సంబరాలలో చిందేస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్

ఎల్‌బీనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు సంఘటితంగా ఉంటే దేశం సురక్షితంగా ఉంటుందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయభేరి మోగించడంతో కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీజేపీ నేతలతో కలిసి సరూర్‌నగర్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియా కూటమితో దేశానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించిన మహారాష్ట్ర ప్రజలు సంఘటితమై ఎన్‌డీఏ కూటమికి పట్టం కట్టారన్నారు. ఈ సంబరాలలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కబీర్‌దాస్, మూర్తి, మహేష్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సాతెల్లి సాయినాథ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో 'మహా' సంబరాలు..

సరూర్‌నగర్: మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్‌లో కలవరం మొదలయిందని, ఇక దేశవ్యాప్తంగా ఆ పార్టీ కనుమరుగు కాక తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీయే(మహా యుతి) కూటమి విజయదుందుభి మోగించడంతో శుక్రవారం బాలాపూర్ చౌరస్తాలో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి స్థానికులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నమ్మించి రప్పించి.. రియల్ వ్యాపారి కిడ్నాప్

- రూ.కోటి కోసం డిమాండ్
- కాగితాలపై వేలిముద్రలు, సంతకాలు.. తీసుకున్న నిందితులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారిని ప్లాట్లు విక్రయిస్తామని పిలిపించి కిడ్నాప్‌చేసి డబ్బుల కోసం డిమాండ్ చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి బొంగులూరు వద్ద చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ బస్తీలో నివాసముంటున్న రచ్చ నారాయణ వస్త్ర వ్యాపారంతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. పది రోజుల క్రితం ఓ మహిళ వాయిస్‌తో ఆయనకు ఓ కాల్ వచ్చింది. కారు ఇన్సూరెన్స్‌కు సంబంధించి మాట్లాడి.. మీరు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తారు కదా అని అడిగి బొంగులూరు దగ్గర తమ ప్లాట్లు ఉన్నాయి.. కొంటారా? అని అడిగారు. దాంతో ఆయన ఈనెల 21న మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో తన కారులో డ్రైవర్ ముజిబ్‌ఖాన్‌తో కలిసి బొంగులూరు దగ్గర ఉన్న మెట్రోసిటీ వెంచర్‌కు వెళ్లాడు. ఇంతలో నలుగురు వ్యక్తులు వచ్చి నారాయణతో పాటు డ్రైవర్‌ను కారులో ఎక్కించుకున్నారు. ఇద్దరి ముఖాలకు నల్లటి మాస్కులు, చేతులకు హ్యాండ్‌కఫ్స్ వేసి 45 నిమిషాల తర్వాత ఓ తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ గదిలో ఉంచారు. ఒకరు పోలీస్ యూనిఫాంతో ఉండగా మిగిలిన వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఉన్నారు. పోలీస్ యూనిఫాంలో ఉన్న అతను నారాయణ తలకు గన్‌పెట్టి కోటి రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించాడు. తన దగ్గర అంత డబ్బు లేదని సమాధానమీయడం తో పది కాగితాలపై ఆస్తికి సంబంధించి సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కొంగర కలాన్ ఏరియాలోని ఓపెన్ వెంచర్‌లో దించి కారు, సెల్‌ఫోన్ అప్పగించారు. దాంతో భయపడిపోయిన నారాయణ నల్లగొండ జిల్లా చండూరులో ఉన్న అల్లుడికి ఫోన్‌చేసి కారులో చండూరు వెళ్లాడు. అదే సాయంత్రం ఆయనకు ధైర్యం చెప్పిన అల్లుడు.. ఇబ్రహీంపట్నం తీసుకొచ్చి కుటుంబ సభ్యులను అప్పగించారు. శనివారం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చలానాలు చెల్లించి వాహనాలు తీసుకెళ్లండి

కొత్తపేట: చలానాలు చెల్లించి, సరైన పత్రాలు చూపి యజమానులు వాహనాలు తీసుకెళ్లాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీ.వేంకటేశ్వర్లు తెలిపారు. పలు రకాల నిబంధనల ఉల్లంఘన కేసుల్లో పట్టుబడిన వారికి చెందిన 61 ద్విచక్ర వాహనాలను సరూర్‌నగర్ పార్కింగ్ యార్డులో భద్రపరిచారన్నారు. సదరు వాహనాల యజమానులకు నోటీసుల ద్వారా సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు. యజమానులు ఆయా కేసుల్లో చలానాలు చెల్లించి, సరైన పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.

గ్రేట్‌ఉడ్ హైస్కూల్లో సైన్స్‌ఫెయిర్

వనస్థలిపురం : విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకశక్తిని వెలికితీస్తాయని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. వనస్థలిపురం సుష్మాసాయినగర్‌లోని గ్రేట్‌ఉడ్ హైస్కూల్లో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ 2024 సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన డ్రిప్ ఇరిగేషన్, కెమికల్ బాండింగ్ సిరీస్, సిరీస్ అండ్ పార్యాలల్ కనెక్షన్స్, కోడింగ్ పైథాన్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌చాట్ జీపీటీ, సోలార్ సిస్టం తదితర నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన మార్కెట్ వైస్ చైర్మన్

సైదాబాద్ : హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శనివారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో పలు పెండింగ్ సమస్యలను దృష్టికి తీసుకువచ్చినట్లు, సానుకూలంగా స్పందించారని కోట్ల శ్రీనివాస్ వివరించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

మన్సూరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో కరపత్రాల పంపిణీ చేపట్టారు. సీఐటీయూ నాయకులు సీహెచ్ కృష్ణయ్య, భాస్కర్, మెట్టు లింగం, లింగస్వామి, సుధీర్, మెట్టు నర్సింహ, మధు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచాలి

దిల్‌సుఖ్‌నగర్ : డివిజన్ ప్రజల అవసరాలకు తగ్గట్లు మురుగునీటి శుద్ధి ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సరూర్‌నగర్‌లోని మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక జనాభా ఉన్నటువంటి గడ్డిఅన్నారం డివిజన్ ప్రాంతానికి 2.5ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగినటువంటి ప్రస్తుత మురుగునీటి శుద్ధి ప్లాంట్ సరిపోదన్నారు. మురుగునీటి శుద్ధి సామర్థ్యం తక్కువగా ఉన్నందు వలన ఈ ప్రాంతవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జలమండలి అధికారులు తక్షణమే స్పందించి ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విన్నవించారు. కార్యక్రమంలో మురుగునీటి శుద్ధి కేంద్ర ఇన్‌చార్జి సాయి, పర్యావరణ పరిరక్షణ ప్రతినిధి పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

జువెనైల్ హోమ్‌కు ద్విచక్ర వాహనాల చోరులు

- ఆరు వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది

మన్సూరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలించి సొమ్ము చేసుకుంటున్న దొంగలను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఆరు వాహనాలను శనివారం నాగోల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ సాయినగర్‌కు చెందిన ఇద్దరు బాలురు షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద, ఇంటి ముందర పార్కింగ్ చేసి ఉంచిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తూ వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారిద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా నేరం అంగీకరించారు. దీంతో నిందితులిద్దరినీ జువెనైల్ హోమ్‌కు పంపించి వారి వద్ద నుంచి ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకోగా ఇందులో రెండు యాక్టీవా, ఒకటి యమహా, మరోటి స్ప్లెండర్, రెండు పల్సర్ వాహనాలు ఉన్నాయి. వీటిలో నాలుగు వాహనాలు నాగోల్, రెండు వాహనాలు చైతన్యపురి పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో చోరీ చేసినవిగా గుర్తించారు. కాగా నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ సూర్యనాయక్, ఎస్ఐ వి.రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు కె.సుభాష్, జె.సాయిహాష్, ఎస్.హిమబిందు, సిబ్బందిని ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య అభినందించారు.

ఫోన్ నంబర్ హ్యాక్ చేసి రూ.1,35,528 దోచుకున్న సైబర్ మోసగాళ్లు

కొత్తపేట: సైబర్ మోసగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగి ఫోన్ నంబర్ హ్యాక్ చేసి రూ.1,35,528 దోచుకున్న సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురం నార్త్ కస్తూరి కాలనీలో ఉండే పల్ల వెంకట్‌రెడ్డి(41) ప్రైవేటు ఉద్యోగి. మూడు రోజుల క్రితం అతడి ఫోన్ నంబర్‌లో గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుండి ఏపీకే(యాండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్) ఫైల్ (పీఎం కిసాన్) ఇన్‌స్టాల్ అయింది. తద్వారా సైబర్ మోసగాళ్లు ఆయన ఫోన్ నంబర్‌ను హ్యాక్ చేశారు. అనంతరం సైబర్ మోసగాళ్లు ఆయనకు చెందిన రెండు ఇండస్ ల్యాండ్ క్రెడిట్ కార్డులు, ఒక ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు ఉపయోగిస్తూ డబ్బు దోచుకున్నారు. క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు కట్ అవుతున్నట్లు ఫోన్ నెంబరుకు మెస్సేజీలు రావడంతో ఆయనకు విషయం తెలిసింది. ఈనెల 20,21 తేదీల్లో 5 విడతలుగా సైబర్ మోసగాళ్లు మొత్తం రూ.1,35,528 దోచుకున్నారని సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెం.1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అరుణ్‌కుమార్

యువకుడి అదృశ్యం

హయత్‌నగర్ : యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన ఏదుల అరుణ్‌కుమార్(22) ఏడు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని రాంనగర్‌కు వలస వెళ్లారు. నాలుగు నెలల క్రితం తిరిగి అరుణ్‌కుమార్ ఎస్‌బీఐ శాఖకు వచ్చిన తల్లి వేతనాన్ని తీసుకువస్తానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అప్పటి నుంచి అరుణ్‌కుమార్ ఇక్కడే ఉంటూ ఓ నాయకుడి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా కొన్ని రోజులుగా అరుణ్‌కుమార్ కనిపించకుండా పోయాడు, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు పెద్దఅంబర్‌పేట్‌లో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం సాయంత్రం తల్లి లత హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య



గంగాధర్‌రెడ్డి మృతదేహం

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం సహా ఆర్థిక సమస్యలతో సతమతమైన ఓ ప్రైవేటు ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట విద్యానగర్‌కు చెందిన మన్సూరాబాద్ హిమపురికాలనీలో ఉండే యానాల గంగాధర్‌రెడ్డి(52) ప్రైవేటు ఉద్యోగి. అతడు అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతూ మద్యానికి బానిసయ్యాడు. 10రోజుల నుంచి అతడు బాలానగర్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం అతడు హిమపురికాలనీకి వచ్చాడు. రాత్రి కామినేని దారిలో గల షిరిడీ సాయిబాబాగుడి వద్దకు చేరుకుని, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం 10గంటల సమయంలో మృతుడి అల్లుడు రాకేష్ రెడ్డి సాయిబాబా గుడి వద్ద గంగాధర్‌రెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి కుమారుడు యానాల హేమంత్‌రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.